# విలువలు

## సింగరాజు రామచంద్రమూర్తి

తలుపు తీసుకుని బయటికి వచ్చి పోర్టికోలో నిలబడింది సావిత్రి.

రోడ్డుమీద జనం చీమల బారుల్లా సాగి పోతున్నారు. ఎవరో వెనక నుంచి తరుముతున్నట్టు, వెనక నుంచి ఏ మహానదో పొంగి వస్తుంటే తాము వేసే ప్రతి అడుగు విలువయినదేనన్నట్లు గబగబ పోతున్నారు ..... ఇంటి దగ్గర తమకోసం వేయి కండ్లతో నిరీక్షించే భార్యల కోసం సైకిళ్ళను సహదేవుడి అశ్వంలా నడిపే ఉద్యోగులు, పొద్దున్నుంచి ముందేసుకుని కూర్చున్న కాలేజీ పుస్తకాలను ఇంటి దగ్గర పడేసి వీధులమ్మట పూరేగుదామనుకునే విద్యార్థులు — సాగిపోతున్న సావిత్రి ఆలోచనలకు శర్మరాక బ్రేకు వేసింది.

సైకిలును వెట్లకానించి "శశిరేఖ రాలేదా సావిత్రీ"? అనడిగాడు నవ్వుతూ శర్మ.

"రాలేదు బావా—చిన్నక్కయ్య మట్టుకు వచ్చి చాలా సేపయింది, పైన ఉంది" అంది సావిత్రి.

"నువ్వు ఈ రోడ్డుమీద వచ్చేపోయే వాళ్ళని గురించి సమగ్రమయిన నివేదిక సమర్పించాలా?" అని నవ్వి పైకి వెళ్ళిపోయాడు శర్మ.

అతను వెళ్ళిన దిక్కుగా కాసేపు చూసి లోపలికి వెళ్ళింది సావిత్రి. ఆమె మనస్సులో ఏదో తెలియని అసంతృప్తి—

"బావ బాగుంటాడు" అనుకుంది సావిత్రి. ఈమాట ఎప్పుడూ అనుకుంటూనే వుంటుంది సావిత్రి. "శశి అక్కయ్య చాలా అందమైనది. చిన్నక్కయ్య మట్టుకు దానికి తీసిపోతుందా? ఊహూ! ఇద్దరూ రంభా ఊర్వశుల్లాగా ఉంటారు.... మరి నేనో?"

ఒక్కసారి గతుక్కుమంది. వెళ్ళి నిలువుటద్దం ముందు నిలబడింది.

"నా దిగులల్లా చిన్నదాని గురించే వదినా— దాన్ని ఎలా ఒకింటిదాన్ని చేస్తామా అని! సన్నాసి, ఆ జబ్బురాని క్రితం బంగారు బొమ్మలా వుండేది! ఆమాట కొస్తే పెద్ద వాళ్ళిద్దరికన్నా యిదే బావుండేది....." తను దగ్గర లేదన్న ధైర్యంతో పక్కింటి అత్తయ్యగారితో అమ్మ అనేమాటలు వింటుండేది తను.

"ఎక్కడికక్కడ సంతృప్తి పడాలి నరసమ్మా— అమ్మవారు అక్కడికి వచ్చి చల్లని చూపు చూసిందని సంతోషించాలి. మశూచికం వచ్చి కళ్ళు పోయిన వాళ్ళున్నారు, చేతులు, కాళ్ళు వంకర పోయిన వాళ్ళు లేరూ?" యివి నాన్నగారు అమ్మని ఓదార్చే మాటలు.

"నాకు రాకూడదూ ఆ రోగం— పెళ్ళి కావలసిన పిల్లకదా?" రాను రాను తను, తన పరిస్థితికి అలవాటు పడి, అమ్మ మాటకు నవ్వుకునేది. "రోగాలు వచ్చేముందు పెళ్ళి అయిందీ, లేనిదీ కనుక్కొని మరీ రావాలి కాబోలు! అయినా కేవలం అందానికి ఆశించి చేసుకున్నా, ఖర్మం చాలక పెళ్ళయాక యిటువంటివి వస్తే చిన్న చూపు చూడరని నమ్మకం ఏమిటి?" యివి తన్ను తను ఓదార్చుకునే మాటల్లో కొన్ని.

అద్దంలో ముఖం చూసుకునేందుకు భయపడేది కొత్తల్లో! మిసగడలా వుండే తన నుదురూ, పాల బుడగల్లాంటి తన బుగ్గలు ఏ స్థితిలో చూడవలసి వస్తుందోనని ఆపాదమస్తకం వణికిపోయేది. కాని కాలంతోపాటు అన్నిటికి అలవాటు పడింది.

పరీక్షగా తన ముఖాన్ని చూసుకుంది అద్దంలో "మా అమ్మకి కండ్లలో సిరి వుంది." అంటారు నాన్నగారు. అవును, తనకు మిగిలింది ఆ సంతృప్తే!"

వెనకగా మెట్లుదిగి క్రిందకు వస్తున్న శర్మ — చిన్నక్కయ్య వసంత కనబడ్డారు అద్దంలో సావిత్రికి. ప్రపంచంలో ఆనందం అంతా మూట కట్టుకున్నట్టుంది వసంత. శర్మ ఏదో చెబుతూంటే కిలకిలా నవ్వింది వసంత.

అద్దంలో వారిని చూసిన సావిత్రి— అద్దం ముందు వీళ్ళు తన్ని చూస్తారేమోనని సిగ్గుపడింది.

"మరదలు పిల్ల ముస్తాబవుతోంది —షికారు పోదాం వస్తావా సావిత్రీ" అనడిగాడు శర్మ దగ్గరగా వస్తూ.

అమ్మకి చెప్పేందుకు యింట్లోకి వెళ్ళింది వసంత.

"రాను బావా— నవల ఒకటి మొదలెట్టాను ఇవ్వాళ పూర్తయి పోవాలి!" అంది సావిత్రి చిన్నగా నవ్వి.

"దాని చదువు, దాని గొడవ తప్పితే ప్రపంచం ఏమైపోయినా పట్టించుకోదు. మనం పోదాం రా" అంటూ శర్మని లాక్కుపోయింది వసంత.

అక్కడనే సోఫాలో కూర్చుని 'హార్డీ' నవల 'ఫ్రొల్ ఫ్రం ది మాడింగు క్రౌడ్' చదువుతోంది సావిత్రి.

"శర్మ వచ్చాడా సావిత్రీ?" అంటూ హడావిడిగా వచ్చింది శశిరేఖ.

పుస్తకంలోంచి కండ్లు పైకెత్తి "ఒక పావు గంట అయిందక్కయ్యా — చిన్నక్కయ్యా బావా కలిసి వెళ్ళారు" అంది సావిత్రి.

దెబ్బతిన్నదాని లాగా "అనుకున్నంతా అయిందన్నమాట. అందుకే కాబోలు లాస్టవరు ఎగ్గొట్టి యింటికి వచ్చేసిందట" అని విసుక్కుంది శశి. "ఎక్కడికి పోయారో ఏమైనా చెప్పారా?"

"లేదు. బావ నన్ను షికారు వస్తావా అనడిగాడు"—

"వసంత రావద్దందా?"

"ఊహూ నేనే రానని చెప్పాను'

"వెళ్ళకపోయావూ?" అని రుసరుసలాడుకుంటూ పైకి వెళ్ళిపోయింది శశిరేఖ.

సావిత్రి నవ్వుకుంది యిద్దరక్కయ్యల మధ్య యీ అర్థం లేని పోటీకి. "బావ చిన్నక్కయ్యతో వెడితే పెద్దక్కయ్యకు కోపం. దానితో వెడితే దీనికి కోపం. నేనంటే మటుకు ఇద్దరికీ భయం లేదు." అని బాధగా నవ్వుకుంది.

శశిరేఖ హడావిడిగా డ్రస్ చేసుకుని బయటకు వెళ్ళిపోయింది వాళ్ళని వెతికి పట్టుకునేందుకు!

మెడికల్ కాలేజిలో వార్షికోత్సవం ఆనాడు. రంగు రంగుల తోరణాలతో అలంకరించారు. అసలే ప్రొఫెషనల్ కాలేజి, అందులోను సృష్టికి ప్రతి సృష్టి చేయగలిగిన వైద్యుల్ని తయారు చేసే సంస్థ. ఆ హోదాకి తగినట్టుగానే వుంది వాతావరణం. అహూతుల సమక్షంలో క్రికెట్ ఎగ్జిబిషన్ మాచ్ పెట్టారు.

శర్మకి ప్రత్యర్థి భాస్కరం. మెడికల్ కాలేజిలో చేరిన మూడేండ్లబట్టి శర్మని ఎలాగైనా అధిగమించాలని పట్టుదలతో కృషి చేస్తున్నాడు భాస్కరం. కాని ప్రతి పోటీలోను శర్మదే విజయమవటం అతనికి కష్టంగా వున్నా బయటమట్టుకు యిద్దరు మంచి స్నేహితులు. టెన్నిస్ ఛాంపియన్ శర్మ అయితే రెండవ వాడుగా వుండేవాడు భాస్కరం.

ఆనాటి ఆటకి కూడా శర్మ ఒక టీముకి, భాస్కర్ ఒక టీముకి నాయకులుగా ఉండి ఆడారు. కాని బౌలింగ్‌లోనూ, బాటింగులోనూ విజృంభించి తన టీముకి విజయం సంపాయించాడు శర్మ.

ప్రేక్షకుల్లో కూర్చుని ఆట చూసిన శశిరేఖ ఆనందానికి అంతులేదు. శర్మ విజయం తనదిగానే భావించి, సంబరపడిపోయి, గబగబ అతనికి ఎదురు వెళ్ళి—

"కంగ్రాట్స్ శర్మా" అంటూ అతన్ని అభినందించింది. అక్కడి తతంగం అంతా అయ్యాక "సినిమాకి వెడదాం పద కాసేపు సరదాగా" అని ప్రతిపాదించింది.

"అలాగే — మాస్టారుకు చెప్పి వచ్చేస్తా" అంటూ లోపలికి వెళ్ళాడు శర్మ.

శశిరేఖ చుట్టూ కలయ చూసింది తృప్తిగా నిట్టూర్చింది. శర్మతో కలిసి సరదాగా సినిమాకు వెళ్ళేందుకు ఈ అవకాశం కోసం ఎన్నాళ్ళనుంచో ఎదురు చూస్తోంది శశిరేఖ. ఆఖరు క్షణంలో వసంత వచ్చి ఎక్కడ తన ఆనందాన్ని పాడు చేస్తుందోనని ఆమె భయం. మొత్తానికి ఇంకొక్క అయిదు నిముషాలు అది రాకపోతే

బావతో సహా కారులో పడచ్చు. తరువాత అవకాశాన్ని బట్టి తన మనస్సులోని మాటలు అతనికి చెప్పవచ్చు. కాలేజి మొత్తం మీద పెద్దస్పోర్ట్సుమన్ తనవాడవుతాడు. ''బావకి 'టెస్ట్' మాచెస్‌లో కూడా అవకాశం రావచ్చు.'' అని నవ్వుకుంది మనస్సులో.

''పోదాం పద'' అంటూ కోటు బుజం మీద వేసుకుని వచ్చాడు శర్మ.

''బయట కారు ఉంది పద'' అని అతని పక్కన నడుస్తూ తన వంక ఎన్నిజతల కళ్ళు ఈర్ష్యగా, చూస్తున్నాయో మనస్సులోనే లెక్క కట్టుకుని మురిసి పోతోంది శశిరేఖ.

ఇద్దరూ కలిసి కారు దగ్గరకు వచ్చారు. ''రా బావా'' అంటూ డోర్ తీసి తెల్లబోయింది.

స్టీరింగు దగ్గర వసంత కూర్చుని ఉంది!

''రా బావా'' అంది వసంత కూడా ఏమీ జరగనట్టుగా.

''ఎప్పుడొచ్చావే నువ్వు ?'' అడిగింది శశిరేఖ.

''చాలా సేపయింది. ఇంటి దగ్గిర కారు లేకపోతే హేమ లిఫ్టిచ్చింది. మనకారు బయట కనబడింది — లోపల కూర్చున్నాను'' అంది తేలిగ్గా వసంత.

''లోపలికి రాలేదేం ?'' అడిగాడు శర్మ.

''నేవచ్చేటప్పటికి మాచ్ అయిపోయింది. సరే — ఎప్పటికయినా ఇక్కడకు రావలసిన వాళ్ళేగా!''

ఒక్కసారి శర్మ వంక, వసంత వంక చూసి— తాను వసంత పక్కన కూర్చుంది శశిరేఖ!

శర్మకి ఈ సన్నివేశం చాలా చిత్రంగా కనబడింది. నవ్వుకుంటూ వెనకసీటులో కూర్చున్నాడు.

మూడు టిక్కెట్లు తీసుకుని లోపలికి నడిచారు. కుర్చీల వరసలోకి ఎవరు ముందు నడవాలన్నది పెద్దప్రశ్న అయిపోయింది అప్పచెల్లెళ్ళకి.

''ముందు తను పోతే వెనక వసంత, ఆ వెనక శర్మ వస్తే—'' అని శశిరేఖ భయం.

అదే వసంత అనుమానం కూడా!

ఇద్దరి పరిస్థితిని ఒక్కక్షణంలో ఆకళింపు చేసుకున్నాడు శర్మ. వీళ్ళ పోటీకి కారణం అతనికి సరిగా అంతుపట్టలేదు కూడా!

ముందు తను లోపలికి నడిచి రెండువైపులా వాళ్ళనిద్దరినీ కూర్చోమన్నాడు.

వసంత ఇలా పానకంలో పుడకలా రావడం శశికి ఏమీ నచ్చలేదు. అందుకే బుంగమూతి పెట్టి మాట్లాడకుండా కూర్చుంది. తను వచ్చిన పని సక్రమంగా నెరవేరినందుకు తన్ని తను అభినందించుకుంటూ మౌనంగా కూర్చుంది వసంత!

ఇద్దరు అజంతా సుందరుల మధ్య కూర్చున్నట్లుంది శర్మ పరిస్థితి!

• • •

పుస్తకం పూర్తిచేసి చదివిన దాన్ని సింహావలోకనం చేసుకుంటోంది సావిత్రి. జబ్బుపడినాక చదువు ఆ ఏటికి ఆపుచేయడం వలన ఇంట్లోనే ఖాళీగా ఉండిపోయింది సావిత్రి. వస్తుతః సారస్వతం మీద అభిమానం కలది కాబట్టి, ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకుంటోంది.

తను ప్రేమించిన 'లూసీ మానెట్' తన్ని తిరస్కరించినా ఆమె వివాహమాడిన 'డార్నే' ప్రాణం రక్షించేందుకుని మృత్యుగహ్వరంలోకి చొరబడిన సిడ్నీకార్టన్ అపూర్వ త్యాగం ఆమెను విభ్రాంతి పరిచింది. అటువంటి పాత్రను సృష్టించిన 'డికెన్స్' కి మనస్సులోనే జోహారులర్పించింది.

శశిరేఖ, శర్మ కలిసి ఎక్కడనుంచో వచ్చినట్టున్నారు — పైకిపోబోతూ గబుక్కున ఆగి సావిత్రి దగ్గరకు వచ్చి— ''వసంత పైన ఉందా సావిత్రీ ?'' అనడిగింది శశిరేఖ.

''ఉందనుకుంటానక్కయ్యా — బావ వస్తే రమ్మనమని చెప్పమంది'' అంది సావిత్రి.

శశిరేఖ కాసేపు ఏదో ఆలోచించి ''శర్మా— కాసేపు నువ్వు సావిత్రితో మాట్లాడుతూండు. ఇప్పుడే వస్తాను'' అంటూ డ్రస్సింగు రూము లోకి వెళ్ళింది.

శర్మ వచ్చి సావిత్రికి ఎదురుగా కూర్చుని ఆమె వంక చూసి ''ఎందుకు సావిత్రి నవ్వుతున్నావు ?' అనడిగాడు తనుకూడా కొద్దిగా నవ్వుతూ.

''అబ్బే — ఏం లేదు బావా — పుస్తకంలోని కథగుర్తుకొచ్చి'' అంది సావిత్రి.

''టేల్ ఆఫ్ టూ సిటీస్'' చదువుతే నవ్వు వస్తుందని నీ ఒక్కదాని నోటమ్మట విన్నాను'' అని కాసేపాగి ''నువ్వెందుకు నవ్వావో చెప్పనా ?'' అనడిగాడు సూటిగా ఆమె ముఖంలోకి చూస్తూ.

''చెప్పుచూద్దాం!''

''నువ్వు మనస్సులో బాధపడకూడదు సుమీ! '

''ఊహూ! బాధపడటం మానేసి చాలారోజులయిందిలే!''

''అయితే విను. పైన వసంత ఉందనుకుంటూ — అందుకని నన్ను పైకి తీసుకువెడితే పోటీ వస్తుందని ఇక్కడ నీతో మాట్లాడమంది శశిరేఖ . . . నీతో నేను మాట్లాడితే వాళ్ళకి భయం లేదు. రైటేనా నే చెప్పేది ?'' అనడిగాడు.

సావిత్రి జవాబు చెప్పేలోపల వాళ్ళమ్మ వచ్చి —శర్మా — రీడింగు రూమ్‌లో మీ మావయ్య ఉన్నారు. నిన్నోకసారి రమ్మంటున్నారు— మాట్లాడాలిట'' అని చెప్పి వెళ్ళిపోయింది.

లేచి లోపలికి వెళ్ళాడు శర్మ ''ఏం మావయ్యా పిలిచావట?'' అనడిగాడు.

''అవును. కూర్చో—పరీక్షలు బాగా రాశావా''

''ఆc''

''ఈ ఏడు రంజీ ట్రోఫీకి సెలెక్టు అవుతావటగా!'

''ఎవరు చెప్పారు?''

''వసంత... సరేగాని నువ్వు శశిరేఖతోను వసంతతోను కూడా కలిపి తిరుగుతున్నావు. వాళ్ళిద్దరికీ నువ్వంటే యిష్టం లాగానే వుంది. కాబట్టి నువ్వు ఎవరో ఒకర్ని తేల్చుకుని చెప్పాలి. మీకు పరీక్షలు కూడా అయిపోయాయి. కాబట్టి ఈ సమ్మర్‌లో యిద్దరికీ పెళ్ళి చేయాలని అనుకుంటున్నాను.....'' అన్నారు ఆయన.

''అలాగే మావయ్యా'' అంటూ బయటికి వచ్చేశాడు. అతని మనస్సంతా ఆలోచనలతో నిండి పోయింది. ఇంతవరకు అతను తన మనస్సును కూడా వేసుకోని ప్రశ్న — వేసుకునేందుకు భయపడిన ప్రశ్న యిది! దీన్నిగురించి తీవ్రంగా ఆలోచించనిదే ఒక నిర్ణయానికి రాకూడదనుకున్నాడు. జీవితానికి సంబంధించిన ప్రశ్న మరి!

రోజులు వారాల్లా కలసి పోతున్నాయి.

రంజీ ట్రోఫీలో ఆంధ్రా తరఫున పాల్గొనే జట్టుని ఎన్నుకునేందుకు రాష్ట్రంలో పేరు తెచ్చుకుంటున్న ఆటగాళ్ళనందరినీ ఆహ్వానించారు. శర్మ, భాస్కరం యిద్దరూ వెళ్లారు.

శర్మ ఎప్పుడు తిరిగి వస్తాడా — సెలక్టయానని ఎప్పుడు చెబుతాడా — అని వసంతా, శశిరేఖ ఎదురు చూస్తున్నారు. యిందులో బాగా ఆడితే 'టెస్ట్' మాచెస్‌లో అవకాశం రావచ్చు. అప్పుడు దేశం మొత్తం మీద పెద్ద పేరు, పలుకుబడి — రేడియోలో వ్యాఖ్యానాలు — ఓహ్! అటువంటి వాడి భార్య కావడం కన్నా కోరదగినది మరేమీ కనబడ లేదు వాళ్ళకి.

అనుకున్న రోజు రానే వచ్చింది. కాని శర్మ మట్టుకు రాలేదు. కారణం ఏమై వుంటుందా అని ఖంగారు పడుతుంటే, ఒక కుర్రాడు వచ్చి శర్మ నేరుగా తన గదికి వచ్చాడని అక్కడికి రమ్మనమని వాళ్ళకి చెప్పాడని చెప్పి వెళ్ళిపోయాడు.

హడావిడిగా డ్రస్ చేసుకుని, వీళ్ళు వెళ్ళేప్పటికి శర్మ మంచం మీద పడుకుని వున్నాడు. కుడిచేతికి కట్టు కట్టి వుంది.

''ఇదేమిటి బావా?'' అనడిగింది శశిరేఖ ఆశ్చర్యంగా.

తను వేద్దామనుకుంటున్న ప్రశ్న అక్కగారు వేసినందుకు కోపం వచ్చింది వసంతకి.

''ఏమీలేదు. చిన్న ఆడుతుంటే కింద పడ్డాను. కుడిచేయి విరిగింది.'' అన్నాడు బాధగా శర్మ.

''అంటే?'' అన్నారిద్దరూ.

''చెప్పాగా — కుడిచేయి మోచేతి దగ్గర ఎముక విరిగిందని డాక్టర్లు పరీక్షించారు. చేయి మళ్ళీ బాగు పడుతుంది కాని ఆ చేత్తో బలమైన పని ఏదీ చేయకూడదు అన్నారు''

''అంటే!'' మళ్ళీ అదే ప్రశ్న వేశారు ఇద్దరూ తెల్లబోతూ.

పేలవంగా నవ్వాడు శర్మ ''అంటే ఆటకి యిక పనికిరానన్నమాట. పెళ్ళి చేసుకుని ఏదో ఉద్యోగం చేసుకుంటూ సుఖలాడిలాగా బ్రతకమన్నారు.''

ఇద్దరికీ కండ్లలో నీళ్లు తిరిగాయి.''ఆశలన్నీ అడియాసలవ్వాలసిందే!'' అరిచింది శశిరేఖ బాధగా!

''ఎవరి ఆశలు?''

శర్మ ప్రశ్న వినిపించుకోకుండానే ముఖాన్ని చేతులతో కప్పుకుని గిరుక్కున తిరిగి వెళ్లిపోయింది శశిరేఖ.

---

''వసంతా నీతో ఒక్కమాట చెప్పాలి...... మావయ్య.....''

''ఇప్పుడు కాదు బావ — నామనస్సేమీ బాగుండలేదు.

వాళ్లు వెళ్లిన కొంత సేపటికి సావిత్రి వచ్చింది. ''అక్కయ్య వాళ్లు యింటికి వచ్చి ఏడుపులు మొదలెట్టారు బావా — అప్పుడు తెలిసింది నీకు చేయి''....'' మాట పూర్తి కాక ముందే గొంతు పూడిపోయింది సావిత్రికి.

''కూర్చో సావిత్రీ — నువ్వుకూడా వాళ్ల లాగే పారిపోకు''

''అవేం మాటలు బావా? వాళ్లిద్దరూ మేడ మీదికి పోయి ఏడుస్తున్నారు తెలుసా?'' అంది బాధగా సావిత్రి.

''హుఁ! ఏడుస్తారు. అది నాకు దెబ్బతగిలిందని కాదు — వాళ్ల వ్యూహాసాధాలకి దెబ్బతగిలిందని. వాళ్లు నామీద పెంచుకున్న ఆశలు ఫలింప చేసేందుకు నేను అనమర్థుడినని గ్రహించారు. వెళ్ళిపోయారు... కాసేపు ఏవైనా కబుర్లు చెప్పు సావిత్రీ! నువ్వు చదివిన పుస్తకాలు గురించి!''

''కట్లు విప్పి కాపడం పెడతాను బావా! తరువాత కబుర్లు'' అని చేయి మీద చేయి వేసింది.

ఖంగారు పడి ''ఒద్దొద్దు, యింకా కాపడంతో పనిలేదులే! కుంటాడికి అదొక్కటే తక్కువ'' అన్నాడు ఆమె చేతిని మెల్లగా తీసి.

• • •

ఒక రోజు శశిరేఖకి కబురు చేస్తే వచ్చింది హడావిడిగా. ''పిలిపించావెందుకు?'' కూర్చోకుండానే అడిగింది.

''మావయ్య మన పెళ్లి విషయం ఏదో ఒకటి తేల్చమన్నాడు శశీ — ఏమంటావు?'' అనడిగాడు.

''సారీ శర్మా — నేనెప్పుడూ నిన్ను ఆ వుద్దేశంతో చూడలేదు. ఒక స్పోర్ట్సుమన్‌గా ఆరాధించాను. అంతే... భాస్కరంతో ఇవ్వాలో రేపో 'ఎంగేజి' అవుదామనుకుంటున్నాను. అడుగో మాటల్లో వచ్చేశాడు భాస్కర్'' అంది అతన్ని చూసి ముఖం మీదికి నవ్వు తెచ్చుకుంటూ.

''ఏం బ్రదర్ — ఎంతవరకు వచ్చావు?'' అనడిగాడు నవ్వుతూ భాస్కరం.

''ఫలితాలకి దగ్గరగా వస్తున్నాం! విష్ యూ గుడ్ లక్!'' అన్నాడు నవ్వుతూ.

ఇద్దరూ వెళ్లిపోయారు.

కాసేపటికి సుడిగాలిలా దూసుకొచ్చింది వసంత.... ''భాస్కర్ వచ్చాడా బావా?'' అనడిగింది వస్తూనే.

''ఆఁ వచ్చాడు. శశి, అతను కలసి యిప్పుడే బయటికి వెళ్లారు. ఒక్కమాట. మావయ్య మన పెండ్లి విషయం తేల్చమన్నాడు వసంత! ఏమంటావు?''

''క్షమించు బావా — నాకే ఉద్దేశ్యం లేదు. భాస్కర్ ఎటు వెళ్లాడన్నావు?''

''ఒక్క సలహా వసంత — అప్ప చెల్లెళ్ల మధ్య పోటీ ఆరోగ్యకరం కాదు సుమీ''


''నీసలహాకి థాంక్సు'' అంటూ వెళ్లిపోయింది.

ఒక్కసారి తృప్తిగా నిట్టూర్చాడు శర్మ. ''అనుకున్నంతా అయింది. వీళ్లు ప్రేమించింది నాలోని కాబోయే ''టెస్టు'' ఆటగాడిని. వీళ్లకి కావలసింది నేను సంపాయించబోయే కీర్తికాని, నేను కాదు. ఆల్‌రైట్. అన్నీ తెలుసుండి కూడా ఒప్పుకున్నాడు. భాస్కర్‌నే పడనిద్దాం యిద్దరితో బాధ'' అని నవ్వుకున్నాడు.

''ఏమిటి బావా నవ్వుతున్నావు? ఎవరైనా జ్ఞప్తికి వచ్చారా ఏమిటి?' అంది సావిత్రి లోపలికి వస్తూ.

చేతిలో వున్న సంచీ చూసి ''ఆ సంచీ ఏమిటి? అనడిగాడు.

''పండ్లు.పిల్లల్ని, రోగిష్టివాళ్లని, చూసేందుకు వట్టి చేతులతో వెళ్లకూడదట. తరువాత చదివి వినిపించేందుకు కథల పుస్తకాలు కూడా



తెచ్చాను.'' అని అతనికి ఎదురుగా కుర్చీలో కూర్చొని ఏపిల్ పండు తీసి కోయసాగింది.

ఆమెవంక కాసేపు పరీక్షగా చూసి ''మావయ్య నా పెళ్లి విషయం తేల్చి చెప్పమన్నాడు సావిత్రీ'' అన్నాడు హఠాత్తుగా.

''తేల్చి పారేయ్! కాని బావా, నీ పరిస్థితి చాలా ఇరకాటంలో పడింది. పెద్దక్కయ్యని చేసుకుంటే, చిన్నక్కయ్యకు కోపం — చిన్నక్కయ్యని చేసుకుంటే, పెద్దక్కయ్య పెండ్లేమానేస్తుంది'' అంది నవ్వుతూ.

''ఆ బాధ తప్పించారులే యిద్దరూ — ఇద్దరూ నన్ను చేసుకోరట!''

ఉలిక్కిపడింది సావిత్రి. ''నిజంగానా?''

''లేకపోతే ఒక కుంటి వాడిని వాళ్లెందుకు చేసుకుంటారు సావిత్రీ! ఇద్దరూ భాస్కరం వెంట పరుగెత్తారు.'' అని కాసేపాగి ''యిక నువ్వు మిగిలావు! నువ్వుకూడా వద్దంటే....''

''నేనా?'' ఆశ్చర్యపోతూ తలెత్తింది.

''అవును సావిత్రీ! నువ్వు అంగీకరించావంటే నా అంత అదృష్టవంతుడుండడు.!''

''అలాగనకు బావా — నేను నీకు తగను. క్షణికావేశానికి లోనై నీ జీవితం పాడుచేసుకోకు!'' అంది.

''మనస్సాక్షిగా చెబుతున్నాను సావిత్రీ! నాక్కావలసింది బాహ్య సౌందర్యం కాదు, మనస్సౌకుమార్యం.... అంగీకరించవూ!''

''వాకండ్లలో అదృష్టం వుందంటారు మా నాన్నగారు. ఆమాట అక్షరాలా నిజమైంది బావా!'' అంది సిగ్గుతో తలవంచుకుని.

చివాలున మంచం మీంచి లేచి రెండు చేతులతో ఆమెను దగ్గరకు తీసుకుని ''నీకు అందం తగ్గకుండా వుండి వుంటే సావిత్రీ, నీ అక్కయ్యల్లాగానే నన్ను కాదని పోయేదానివేమో యిక నువ్వునాదానివి సావిత్రీ!'' అన్నాడు ఆవేశంతో.

ఆశ్చర్యపోయింది సావిత్రి ''బావా నీ చేయి.''

''చేయీ లేదు, కాలూ లేదు అసలు నాకు చేయి విరగలేదు. కొద్దిగా బెణికింది. అంతే! భాస్కరం, నేను యిద్దరం సెలెక్టు అయాం''

''అయితే యిదంతా?''

''నాటకం — మీ అక్కయ్యల నిజ స్వరూపం చూసేందుకు''

''అన్యాయం బావా! — వాళ్లని మోసం చేశావు... నేను నీకు తగను బావా!''

''నేను కుంటాడినైతేనే నీకు తగ్గవాడనన్న మాట. అదేం కుదరదమ్మాయి — ఇవ్వాళే మావయ్యతో చెప్పేస్తాను'' అని దగ్గరకు లాక్కున్నాడు.

అతని కౌగిట్లోకి యిమిడిపోయింది సావిత్రి.